రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## ప్రధాని దిష్టిబొమ్మను దగ్ధంచేసిన వారిపై ఫిర్యాదు

**వికారాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

దేశప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను బుధవారం జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు. ఈవిషయమై బిజెపినాయకులు గురువారం స్థానికపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా బిజెపినాయకులు మాట్లాడుతూ, ప్రపంచం మెచ్చే నేత ప్రధాని నరేంద్రమోడీ అని, అలాంటి ఉన్నతవ్యక్తి దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దగ్ధంచేయడంపై బిజెపినాయకులే కాకుండా, ప్రజలు సైతం తీవ్రమనోవేదనకు గురయ్యారని అన్నారు. విద్వేషాలురెచ్చగొట్టేలా, ప్రజలమనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దిష్టిబొమ్మను దగ్ధంచేసిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్‌నాయకులు సుధాకర్‌రెడ్డి, చిగుళ్ళపల్లి రమేశ్‌కుమార్, చాపల శ్రీనివాస్, నిఖిల్, రాజశేఖర్‌రెడ్డి, రెడ్యానాయక్, సుధాకర్‌గౌడ్‌లతోపాటు ఇందులో పాలుపంచుకున్న నాయకులపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు బిజెపినాయకులు తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లాఅధ్యక్షులు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, బిజెపి సీనియర్‌నాయకులు యాదగిరి, మోహన్‌రెడ్డి, సుధాకర్‌చారి పాల్గొన్నారు.

## రెవెన్యూశాఖామంత్రి పొంగులేటికి ఘనసన్మానం



రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

**కొడంగల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

కొడంగల్ నియోజకవర్గకేంద్రంలో రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని గురువారం భూ భారతి పోర్టల్ ప్రారంభోత్సవానికి నియోజకవర్గంలోని మద్దూర్ మండలంలోని ఖాజీపూర్‌కు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డితో కలిసి వెళ్తున్న క్రమంలో కొద్దిసేపు కొడంగల్‌లో ఆగారు. ఈక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిపి ముద్దప్ప దేశ్‌ముఖ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కొడంగల్ నయ్యూం తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. అనంతరం మంత్రి మద్దూర్ కు బయలుదేరి వెళ్ళారు. మంత్రివెంట పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శ్రీరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

## కక్ష సాధింపుతోనే కాంగ్రెస్ అగ్రనేతలపై కేసులు

**-షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



గన్‌పార్కు వద్ద ధర్నాలో పాల్గొన్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

నేషనల్ హెరాల్డ్ కేసులో ఏఐసిసి అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను ఈడి చార్జిషీట్‌లో చేర్చడాన్ని నిరసిస్తూ టిపిసిసి ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు. గన్‌పార్కు నుంచి బషీర్‌బాగ్ ఈడి కార్యాలయం వరకు భారీగా పార్టీశ్రేణులు ర్యాలీ నిర్వహించాయని ఎమ్మెల్యే శంకర్ స్థానిక మీడియాకు తెలిపారు. అనంతరం ఈడి కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీకి చెందిన నేషనల్ హెరాల్డ్‌కు రూ.90 కోట్లు రుణం ఇస్తే మనీ లాండరింగ్ జరిగినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై అక్రమకేసులు పెట్టారని మండిపడ్డారు. ఈధర్నాలో ఏఐసిసి ఇంఛార్జి మీనాక్షినటరాజన్, పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఎంపిలు, పార్టీనాయకులు హాజరయ్యారు.

## రాజ్యాంగ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



ఆకుతోటపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

రాజ్యాంగం పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పోకడలతో రాజ్యాంగం ప్రమాదంలో పడే అవకాశాలు పొంచి ఉన్నాయని, ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం గురువారం రెండవరోజు ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో జరిగింది. మండలపార్టీ అధ్యక్షుడు తెల్లమళ్ళ జగన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. పార్టీ శ్రేణులు రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ శ్రీ వెన్నెల, టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డిలతోపాటు నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ జెండాలను చేతబట్టి పాదయాత్రతో గ్రామంలో గడపగడపకు తిరుగుతూ భారత రాజ్యాంగ పరిరక్షణపట్ల ప్రజలకు అవగాహనకల్పించారు. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు తెల్లమల్ల జగన్, ఆమనగల్లు పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ వైస్‌ఎంపిపి జక్కు అనంతరెడ్డి, మాజీసర్పంచులు ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం, వెంకటరమణారెడ్డి, బలరాం, ఉప సర్పంచ్ అంజన్‌రెడ్డి, మాజీఎంపిపి అనితవిజయ్, మార్కెట్‌కమిటీడైరెక్టర్ శ్రీశైలం, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, కృష్ణానాయక్, మాజీ ఉపసర్పంచ్ కొప్పు శేఖర్‌గౌడ్, మాజీ యూత్ మండల అధ్యక్షుడు రాజు, గోవింద్, కొండయ్య, షఫీ, నరసింహ, బుచ్చయ్య, చిన్న కృష్ణయ్య, రాజు, మహేశ్, ఎండి ఫరీద్, పర్వతాలు, ఢిగ్రీ కృష్ణ, పులికంటి మైసయ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కవితను కలిసిన బిఆర్ఎస్ యువనాయకులు



జాగృతి అధ్యక్షురాలు కవితను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న వినోద్‌నాయక్

**జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను జిల్లేడు చౌదరిగూడ మండలంలోని గోవులబండకు చెందిన వినోద్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు గురువారం తెలిపారు. భవిష్యత్తులో జాగృతిలో పనిచేయడానికి ప్రత్యేక ఆహ్వానం అందినట్లు తెలిపారు. అవకాశం కల్పిస్తే జాగృతిలో కీలకంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు వినోద్‌నాయక్ తెలిపారు.

## భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలి

**-తెలంగాణా ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు**

**కొడంగల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

కొడంగల్‌మండలం అప్పాయిపల్లిగ్రామంలో మెడికల్ కళాశాల, వెటర్నరీ కళాశాలకోసం భూములిచ్చిన రైతులకు న్యాయంచేయాలని తెలంగాణా ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లాఅధ్యక్షులు ఎర్రన్‌పల్లి శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పాయిపల్లిలో మెడికల్, వెటర్నరీ కళాశాల కోసం తీసుకుంటున్న 19సర్వేనెంబర్‌లో భూములకు ఇస్తామన్న నష్టపరిహారం ఇవ్వకుండా అసలు భూములులేని, రికార్డులోలేని కాంగ్రెస్ కార్యకర్తలకు డబ్బులిచ్చి రికార్డులో ఉన్న అసలైన రైతులకు ఇవ్వకుండా బలవంతంగా పోలీసులను పెట్టి భూములను ఆక్రమించుకుంటున్న కాంగ్రెస్‌ప్రభుత్వం అంటూ ఇదెక్కడిన్యాయం అంటూ మండిపడ్డారు. ఇదేవిషయమై అధికారులను ప్రశ్నిస్తే అది పైఆఫీసర్లకుతెలుసు మాకు తెలవదంటూనే బలవంతంగా భూమిని ఆక్రమించుకొని బుల్డోజర్లతో చదునుచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అందరూ ఏకమై 19సర్వేనంబర్ రైతులకు న్యాయంచేయాలని కోరారు.

# భూ భారతితో భూముల హక్కులు భద్రం

**-భూ సమస్యలకు సత్వరమే పరిష్కారం**
**-రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి**
**-ఆర్డీవో ఎన్‌ఆర్ సరిత ఆధ్వర్యంలో సదస్సు**



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ నారాయణరెడ్డి

**షాద్‌నగర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

రాష్ట్రప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ భారతి2025 చట్టంతో రైతులభూముల హక్కులు భద్రంగా ఉంటాయని, రైతుల మేలుకోసం భూ సమస్యలకు సత్వరపరిష్కారం లభిస్తుందని రంగారెడ్డి జిల్లాకలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో స్థానిక ఆర్డీవో ఎన్‌ఆర్ సరిత ఆధ్వర్యంలో జరిగిన భూభారతి చట్టం2025 అవగాహన సదస్సుకు కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల తహసీల్దారు, రెవెన్యూసిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వ్యవసాయశాఖ అధికారులు, సబ్‌రిజిస్ట్రార్ అధికారులు, మున్సిపాలిటీసిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, నాయకులు, మీడియాప్రతినిధులు హాజరయ్యారు. అవగాహన సదస్సును ఉద్దేశించి కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టంపై రెవెన్యూ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా భూభారతి చట్టంలోని ముఖ్యాంశాలను కలెక్టర్ వివరించారు. ఏవైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. న్యాయ సేవాసంస్థలు, ఇతరసంస్థలు, వ్యవస్థల ద్వారా పేదలకు, షెడ్యూల్డ్‌కులాలు, షెడ్యూల్డ్‌తెగల వారికి, మహిళలకు ఉచిత న్యాయసహాయం, సలహాలు ఈచట్టం ద్వారా అందించాలన్నారు. ముఖ్యంగా తహసీల్దార్లు చట్టంలోని ప్రతి అంశంపై అవగాహన సాధించాలన్నారు. మ్యుటేషన్లు, జారీచేసిన పాసుపుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో లేదా కలెక్టర్‌కు అప్పీలు చేసుకునేలా రెండంచెల అప్పీలువ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. వారసత్వంగా సంక్రమించే భూముల మ్యుటేషన్ విషయంలో నోటీసులు జారీ చేయాల్సిన ప్రక్రియపై సూచనలు చేశారు.

**భూ సమస్యల సత్వర పరిష్కారం...**

భూభారతి చట్టంద్వారా భూసమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ వివరించారు. భూభారతి కీలక అంశాలలోభాగంగా ధరణిస్థానంలో కొత్తభూమి హక్కులరికార్డు, రికార్డులలో తప్పుల సవరణకు అవకాశంకల్పించిందని పేర్కొన్నారు. భూమిహక్కులు ఉండి, రికార్డులోలేనివారు హక్కుల రికార్డులు నమోదు చేయించుకోవడానికి చట్టం వచ్చిన సంవత్సరంలోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కొనుగోలు, దానం, తనఖా, బదిలీ, భాగ పంపకాలద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ రిజిస్ట్రేషన్‌చేసి హక్కుల రికార్డులో మార్పులు చేసి పట్టాదారు పాసుపుస్తకం జారీ చేస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఒకేరోజు జరిగిపోతుందని తెలిపారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ గురించి పలు విషయాలను వివరించారు. వారసత్వం లేదా వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహసీల్దార్ విచారణచేసి హక్కుల రికార్డులు మ్యుటేషన్ చేస్తారని, నిర్ణీతవ్యవధిలో తహసీల్దార్ మ్యుటేషన్ చేయకపోతే డీమ్డ్ మ్యుటేషన్‌గా పరిగణించబడుతుందని తెలిపారు. పాత పాసుపుస్తకం ఉంటే అందులో నమోదు చేయడం లేదా నూతన పాసుపుస్తకం జారీచేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే సివిల్ లేదా రెవెన్యూ కోర్టు తీర్పు లోక్ అదాలత్ అవార్డు అసైన్మెంట్ పట్టా 38, సర్టిఫికెట్ 13బి, సర్టిఫికెట్ ఓఆర్సీ, సేల్ సర్టిఫికెట్ తదితర వాటి ద్వారా హక్కులు సంక్రమిస్తే ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుంటే హక్కుల రికార్డులో మార్పులుచేసి పట్టాదారు పాసుపుస్తకం జారీచేస్తారని తెలిపారు.

సమస్యలపై పరిష్కారం కోరిన ప్రజలు, రైతులు పలువురు రైతులు, నాయకులు, ప్రజలు జిల్లా కలెక్టర్‌తో పలువిషయాలు, సమస్యలు ప్రస్తావించి పరిష్కారమార్గాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ప్రజలు అడిగిన ప్రశ్నలకు సావధానంగా సమాధానాలు చెప్పారు. వెలిజర్ల గ్రామనాయకులు నరసింహ్మారెడ్డి, మైనార్టీ నాయకుడు ఇబ్రహీం, గ్రంథాలయ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, శ్రీను, సీనియర్ జర్నలిస్టులు సంజీవ్‌కుమార్, రాఘవేందర్‌గౌడ్, మాజీ ఎంపిటిసి శ్రీశైలం, బోవ యాదయ్య తదితరులు కలెక్టర్‌ను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. ఈ అవగాహన సదస్సులో మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, తహసీల్దార్ పార్థసారధి, వ్యవసాయశాఖ ఏడి రాజారత్నం, ఎంపిడివో బన్సీలాల్, ఏఈలు నిశాంత్‌కుమార్, డిప్యూటీతహసీల్దార్ ఆనంద్‌సింగ్, ఆయాగ్రామాల కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు రఘు నాయక్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములు రిజిస్ట్రేషన్ చేయబడవు...**
**-రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**

రంగారెడ్డిజిల్లా షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన భూభారతిపై అవగాహన కార్యక్రమంలో భాగంగా గ్రేడ్-1 శాఖ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ నక్క బాల్‌రాజ్‌యాదవ్ కలెక్టర్‌తో మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణరాష్ట్రంలోని కొన్నిజిల్లాల్లోని నియోజక పరిధిలోగల ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్ భూములకు రిజిస్ట్రేషన్ చేయించి పట్టాభూములు ఇప్పించేబాధ్యత మాదని కొంత మంది దళారులు అడుగుతున్న సందర్భాన్ని నక్క బాల్‌రాజ్‌యాదవ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ భూభారతి కీలక అంశాలలోభాగంగా మోసపూరిత హక్కుల రికార్డులను మార్చి ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్‌భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం ప్రభుత్వానికి ఉందని, ఇలాంటి భూములను ఎవరూ కూడా కొనడం గానీ అమ్మడం గానీ చట్టరీత్యా నేరమని, ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న దళారులను నమ్మకూడదని, ఇట్టి భూముల విషయంలో ఏవైనా సవరణ ఉంటే ఆర్డీవోను గానీ కలెక్టర్‌ను గానీ సంప్రతించి ఆయా సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.

# చిల్కూర్‌లోని ప్రభుత్వ భూములను రక్షించండి

**-గత కొన్ని ఏళ్ళుగా కోట్లు విలువైన ప్రభుత్వభూములు అన్యాక్రాంతం**
**-ఆర్డీవోకు పిర్యాదు చేసిన గ్రామస్థులు**
**-తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు ఆర్డీవో ఆదేశం**



మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు ఫిర్యాదుచేస్తున్న చిల్కూర్ గ్రామస్థులు

**మొయినాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మొయినాబాద్ మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూములను రక్షించాలంటూ, చేవెళ్ళ ఆర్డీవో చంద్రకళకు చిల్కూర్‌కుచెందిన వ్యక్తులు పిర్యాదుచేశారు, గురువారం చిల్కూర్ రెవెన్యూలో ఉన్న కోట్ల విలువైన ప్రభుత్వభూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, పేదవాడు జానెడు జాగాలో ఉంటే కూల్చే రెవెన్యూ అధికారులు ఎకరాల కొద్దీ భూములను దేవుళ్ళపేరుతో కబ్జాలు యథేచ్ఛగా చేస్తున్నారని చిల్కూర్‌లో సర్వేనెం 164, 166లో దాదాపు 9 ఎకరాల భూమిని కబ్జాచేసినట్లు వారు ఆర్డీవో చంద్రకళకు గురువారం గ్రామస్థులు పెద్దయెత్తున వెళ్లి ఫిర్యాదుచేశారు. ఆఫిర్యాదులో వారు గత రెండేళ్ళుగా కబ్జాలుచేయబడిన ఫోటోలను, ప్రూఫ్స్‌ను అందజేశారు, తక్షణమే చర్యలు తీసుకొని కోట్ల విలువైన ప్రభుత్వభూములను రక్షించి, ప్రజా ఉపయోగ కార్యకలాపాలకు ఉపయోగపడే విధంగా చూడాలని కోరారు. ఆఫిర్యాదును స్వీకరించిన ఆర్డీవో చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వ భూములను రక్షిస్తామని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ అనుమతులు లేకుండా కబ్జా కాబడిన భూములను రక్షిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు ఫోన్‌చేసి చిల్కూర్‌రెవెన్యూలో ప్రభుత్వభూముల కబ్జాలు జరుగుతున్నాయని వాటిపై చర్యలు చేపట్టాలని ఆర్డర్ జారీచేశారు. ఫిర్యాదుచేసిన గ్రామస్థులకు మొయినాబాద్ తహసీల్దార్‌ను కలవాలని సూచించారు.

చిల్కూర్‌గ్రామస్థులు తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌ను కలిసి ప్రభుత్వ భూములను రక్షించాలని ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన దస్తావేజులతో ఎమ్మార్వోను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, ప్రభాకర్, దేవ్‌కుమార్, పద్మారావు, ప్రశాంత్, నవీన్, జైవర్ధన్, కిరణ్, రాజు, వెంకటేష్, సునీల్, సుధాకర్, ప్రసాద్, గోపాల్, రమేష్, విజయ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

**తహసీల్దార్ గౌతమ్‌కుమార్ వివరణ..**

చిల్కూర్‌లో ప్రభుత్వ భూములను కబ్జాచేసి ఇతర కార్యకలాపాలను కొనసాగిస్తున్నాట్లు ఈరోజు ఆర్డీవో చెప్పడంజరిగింది, చిల్కూర్ గ్రామస్థులు వచ్చి ఫిర్యాదుచేయడం జరిగిందని, చిల్కూర్‌సర్వే నెం.164,166లో పూర్తిస్థాయిలో మా రెవెన్యూ సిబ్బందితో పర్యవేక్షించి చర్యలు చేపడతామని, ప్రభుత్వభూమిలో అనుమతులులేకుండా కబ్జాలు చేస్తే చూస్తూ ఉరుకోమని ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పర్యవేక్షణాలోపం లేకుండా ఆదాయాన్ని పెంచండి

**టిఎస్ఎండిసి పనితీరుపై సమీక్షాసమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



సమీక్షాసమావేశంలో చైర్మన్ వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

శాసనసభ కమిటీహాల్లో ప్రభుత్వరంగసంస్థల కమిటీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ పనితీరుపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిటీసభ్యులు జహీరాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్‌రాజ్ ఠాకూర్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, శాసనసభకార్యదర్శి డాక్టర్ నరసింహ్మాచార్యులు, ఇతర సిబ్బందితోపాటు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్ తదితర సిబ్బందితోపాటు తెలంగాణ ఆడిట్ జనరల్ మాధవి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధిసంస్థలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈసందర్భంగా చైర్మన్ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ఖనిజసంపదను అందరికీ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవలాని కోరారు. పర్యవేక్షణాలోపంతో గతంలో ఇసుక, మైనింగ్, అక్రమతవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టంవాటిల్లిందని పేర్కొన్నారు. గతప్రభుత్వం రాష్ట్రవనరులను సామాన్యుడికి అందకుండా చేసి కొందరి ఆదాయాన్ని పెంచిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం దళారీ వ్యవస్థను నిర్మూలించి ఇసుకను సామాన్యునికి అందేటట్లు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ కృషిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టే ప్రతి పేదవాడికి ఇసుకను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వంపనిచేస్తుందన్నారు. సంస్థద్వారా రాష్ట్ర ఆదాయాన్నిపెంచే మార్గాలను అన్వేషించాలని కోరారు.

## బీహార్ ప్రజాప్రతినిధుల బృందం సందర్శన

**శంషాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

స్థానికసంస్థల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించడానికి బీహార్ స్థానికసంస్థల ప్రజాప్రతినిధుల బృందం శంషాబాద్ మండలంలోని పెద్దతూప్రా గ్రామంలో గురువారం పర్యటించింది. రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ సంస్థ అధికారులతో కలిసి పెద్దతూప్రా గ్రామంలో పర్యటించారు. గ్రామంలో చేపట్టిన పిపివి, టికెపి సామాజిక నర్సరీలను స్థానిక ప్రజాప్రతినిధుల బృందం పరిశీలించింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహకారంతో జరుగుతున్న పనులతీరును పరిశీలించిన బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. ఏయేనిధులద్వారా ఏయేప్రాజెక్టులు చేపట్టారు? అనేదానిని అధికారులు వారికి వివరించారు.




పెద్దతూప్రా గ్రామంలో బీహార్ ప్రజాప్రతినిధులు

## విద్యుద్ఘాతంతో రైతు మృతి

**-సబ్‌స్టేషన్ ముందు గ్రామస్థుల ఆందోళన**

**కొందుర్గు, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

వ్యవసాయ పొలంలో పనిచేస్తున్న ఓ రైతు తెగిపోయిన విద్యుత్ తీగలు తగిలి మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని పర్వతపూర్‌గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నం చింతకుంట్ల అశోక్‌రెడ్డి(38) అనేరైతు తన వ్యవసాయపొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా ఇటీవల గాలివానలకు తెగిపోయిన విద్యుత్ వైరు తగలడంతో విద్యుత్ షాక్‌కుగురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబసభ్యుల రోదనలతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. మూడురోజుల క్రితం గాలివానలతో వైర్లు తెగిపోయాయని, ఈవిషయాన్ని సంబంధితశాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపించారు. అశోక్‌రెడ్డి మృతికి విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ చిన్నఎల్కిచర్ల సబ్‌స్టేషన్ ముందు కుటుంబసభ్యులు, గ్రామస్థులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ఐ రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

## దుకాణం నిర్వాహకులపై దాడి

**-ఇద్దరు వ్యక్తుల అరెస్ట్**

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ఒకిరాణాదుకాణం నిర్వహిస్తున్న భార్యాభర్తలపై దాడికిపాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురాం తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లో రాజస్థాన్ రాష్ట్రంనుంచి బ్రతుకుతెరువుకోసం వచ్చిన దంపతులు కిరాణాదుకాణం నడుపుతున్నారు. ఈక్రమంలో ఈనెల16నరాత్రి 9:30గంటల సమయంలో అవుషాపూర్‌కు చెందిన మచ్చ రాజశేఖర్, మచ్చ విశాల్‌లు వారికిరాణాదుకాణంలోకి వచ్చి షాపులో ఉన్న మహిళ జుట్టుపట్టుకొని నూనెడబ్బాలపైకినెట్టి అసభ్యకరంగా ప్రవర్తించారు. షాపులోకూర్చున్న 3సంవత్సరాల పాపనుకూడా నెటివేయగా మహిళభర్త అడ్డుకోగా అతన్నికొట్టి ఇటుకలతో దాడిచేశారు. దీంతో బాధితులు ఇచ్చినఫిర్యాదుమేరకు విచారణజరిపి నిందితులను బిఎన్ఎస్‌చట్టం ప్రకారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కుతరలించినట్లు సిఐ పరుశురాం తెలిపారు.

## డివిజన్‌లో కార్పొరేటర్ పాదయాత్ర



పాదయాత్రలో కార్పొరేటర్ జితేందర్‌నాథ్

**అల్వాల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** మౌలిక వసతులు కల్పించడానికి ప్రణాళికాబద్దమైన చర్యలు తీసుకుంటున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని శరణ్‌నగర్, రాయల్ ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలులో కార్పొరేటర్ పాదయాత్ర చేశారు. వరద నీటి కాలువలో పూడికతీత, రోడ్లు తదితర సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. శరణ్ నగర్ రోడ్లు పాడవడానికి స్థానికంగా నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనం కారణమని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. బిల్డర్ రోడ్డును నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షం వాహనాలు రాకపోకలు ఆపి వేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసి శ్రీనివాస్ రెడ్డి, డిఇ రఘు, ఎఇ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్ కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, గురు చరణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకం విశేషాలంకరణ



మండపారాధనం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర, దేవి, నవగ్రహాది, హోమాలు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** చిక్కడపల్లి బాపూనగర్ శ్రీ రాజరాజేశ్వర దేవాలయం 41 వార్షికోత్సవ వేడుకలు గురువారం అంగరంభ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా ఉదయం చక్రమేరు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకం విశేషాలంకరణ జరిగింది. అనంతరం కలశ స్థాపనం, మండపారాధనం, లక్ష్మీగణపతి హోమం, రుద్ర, దేవి, నవగ్రహాది, హోమాలు పూర్తి అయిన అనంతరం లలిత సహస్రనామపారాయణం, కుంకుమార్చన, మహామంగళహారతి కార్యక్రమం ఆలయం వేదపండితులు శివశ్రీ ఎం.ఆనందస్వామి, వేదపండితుల మంత్రోచ్చారణ జరిగింది. శుక్రవారం ఉదయం చక్రమేరు శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి సుగంద ద్రవ్యాలు, ఫలరసముల పంచామృతములతో అభిషేకం, మండపారాధన, లక్ష్మీగణపతి, దేవి హోమం, అమ్మవారి మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, విశేష ఆశీర్వచనం తీర్థప్రసాద వితరణ, సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తుల సామూహిక అభిషేకం, ఊరేగింపు, నందికోల సేవ ఉంటుంది. 19న మధ్యాహనం అన్నప్రసాద కార్యక్రమం ఉంటుంది. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

## కృతిమ మేధతో రూపొందించిన 'ఈ పిల్ల' గీతం విడుదల



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కిషోర్‌కుమార్

**సైఫాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** కృతిమ మేధ (ఏఐ) సాంకేతికతో తొలిసారిగా జానపద గీతం గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విడుదలైంది. దీనిని కిన్ని మ్యూజిక్ స్టూడియోస్‌కి చెందిన ఏనుగు కిషోర్‌కుమార్ రచించిన 'ఈ పిల్ల' అనే జానపద గీతం (ఫోక్ సాంగ్) ప్రోమోను ఆయన విడుదల చేశారు. అలాగూ ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిమషాల వ్యవధిలో పాటలు సృష్టించడం సాధ్యమవుతుందని సరైన పదబంధాలతో రచించిన ఈ పాటల ద్వారా భావాలను వ్యక్తీకరించే అవకాశం లభిస్తుందన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు యూట్యూబ్ ఛానల్ (కిన్ని మ్యూజిక్ స్టూడియోస్) హెటిటిపిఎస్://యూట్యూబ్.కాం/ఏట్‌దిరేట్‌ఆఫ్‌కిన్నిమ్యూజిక్‌స్టూడియోస్ ద్వారా విడుదల చేస్తామన్నారు. హేమలత, ఏనుగు సునీషారెడ్డి సంయుక్త నిర్మాణంలో రూపొందించిన ఈ పిల్ల అనే ఈ పాటకు హర్ష నృత్యరీతులు సమకూర్చగ, చైతన్య దర్శకత్వం వహించారు. ఎడిటింగ్ వంశీకృష్ణ చేపట్టారు. ఈ పాటలో వంశీ కృష్ణ, సరస్వతి చౌహన్ నటించారు.

## కళా వికాసంలో సాంస్కృతిక సంస్థల కృషి ఎనలేనిది



పురస్కారాలు ప్రదానం చేస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త

**చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ప్రతిభను గుర్తించి గౌరవించడం సత్సంప్రదాయమని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో త్యాగ రాయ గానసభలో జరిగిన నాట్య వసంతోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాం స్కృతిక సంస్థలు కళా వికాసానికి కృషి చేయడం అభి నందనీయమని అన్నారు. మన సంస్కృతీ సంప్రదా యాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధరంగాల ప్రముఖులకు ఉగాది స్వర్ణనంది పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.చ క్రపాణి, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ నేషనల్ అడ్వైజర్ డాక్టర్ కొమటిరెడ్డి గోపాల్రెడ్డి, సంప్రదాయ కూచి పూడి నాట్యగురువు ఏలేశ్వరపు చలపతి శాస్త్రి, కథక్ కళాక్షేత్ర డైరెక్టర్ పండిట్ డాక్టర్ అంజిబాబు, రచ యిత్రి ముక్తేవి భారతి, అంజనీకుమారి, సాహితీ విధూషిమణి, రమాదేవి బుక్కపట్నం, కళ్యాణి, గొల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఎసిపికి పలువురు శుభాకాంక్షలు



ట్రాఫిక్ ఏసిపి హరి ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు

**సంజీవరెడ్డి నగర్,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** కేరళలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ 2025 టేబుల్ టెన్నిస్ పోటీలలో డబుల్స్ మిక్స్‌డ్ విభాగంలో 2 కాంస్య పతకాలు సాధించిన వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసిపి హరిప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన ఎస్. ఆర్.నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు తదితరులు

## మహాధర్నాకు తరలివెళ్లిన కాంగ్రెస్ నేతలు



ముట్టడికి బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





ఈడి ఆఫీస్ ముట్టడికి బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు



చలో యిడి ఆఫీస్ ముట్టడి కార్యక్రమానికి తరలి వెళుతున్న బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్.

**కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో...**

**జీడిమెట్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా చార్జిషీట్‌లో వారి పేర్ల నమోదును ఖండిస్తూ నిరసనగా గురువారం ఈ.డి కార్యాలయం ముందు ధర్నాకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బయలుదేరారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగు నూరి శ్రీనివాసరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, బొంగు నూరి ప్రభాకర్ రెడ్డి, నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎం రాము గౌడ్, కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మనీష్ యాదవ్, మైనార్టీ నాయకులు రషీద్ బేగ్, చాంద్ భాషా, కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బుచ్చిరెడ్డి, మాజీ కౌన్సిలర్ జయరాం, బైరి శివకుమార్ గౌడ్, డప్పు నరేందర్, ఏనుగుల శ్రీకాంత్ రెడ్డి, షాకీర్, రమేష్ మంజూల్కర్, కృష్ణ యాదవ్, మల్లేష్ యాదవ్, విజయ్ గుప్తా, సదానంద్, లాల్ మొహమ్మద్, చోటు, సంతోష్ రెడ్డి, కుంటి సుమన్, మహిపాల్ రెడ్డి, కే శంకర్, యాసిన్, శ్రీనివాస్ గౌడ్, అంజి ముదిరాజ్, చిన్న, ఖదీర్, రిజ్వాన్, శ్రీహర్ష, సుధాకర్, కిరణ్ రెడ్డి, నాగిరెడ్డి, శ్రీకాంత్, నవీన్ మరియు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు

**కూకట్‌పల్లి నియోజకవర్గం నుండి...**

**కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:** ఎఐసిసి పిలుపు, టీపీసీసీ పిలుపు మేరకు కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాంపల్లి ఈడీ ఆఫీస్ ముట్టడికి గురువారం కాంగ్రెస్ కమిటీ సభ్యులు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాదు ప్రతాపరెడ్డి, మేకల మైఖేల్, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్,రేష్మ నాయుడు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణ రాజ్ పుత్, మొయినుద్దీన్, మేకల రమేష్, మగ్దుం భాయ్, నితీష్ గౌడ్, శివ చౌదరి, ఏఎంసి వైస్ చైర్మన్ ప్రకాష్, సుంకయ్య, సంధ్య, కృష్ణవేణి, యూత్ ఐకాన్ శంకర్, జావేద్, నాయ కులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మోడీ డౌన్ డౌన్, ఈడి డౌన్ డౌన్, అమిత్ షా డౌన్ డౌన్, అను నినాదాలు చేసుకుంటూ ఈడి ఆఫీస్ ముట్టడి కార్యక్రమంలో అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు.

**ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో...**

**కంటోన్మెంట్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ఏఐసీసీ అగ్రనేతలు శ్రీమతి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పేర్లను నేషనల్ హెరాల్డ్ కేసు ఛార్జిషీట్‌లో నిదీ చేర్చడానికి నిరసనగా హైదర్‌గూడా ఈడి కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన మహా ధర్నా కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తన క్యాంపు కార్యాలయం నుంచి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధి గారికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్చుకోలేక బిజెపి రాజకీయ కక్షసాధింపులకు దిగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్యాంసన్ రాజు, చిరబోయిన వైష్ణవి, వి.సి సంతోష్ యాదవ్,బద్రి యాదవ్,నరేష్,శ్రీరామ్ ఆనంద్, సత్యనారాయణ, సదానంద్, నాగినేని సరితలు పాల్గొన్నారు.

**బోరబండ డివిజన్ నాయకులు...**

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త :** ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కడమే పరిపాలన అనుకుంటూ కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం పాలన సాగిస్తుందని గ్రేటర్ మాజీ ఉపమేయర్ స్టాండింగ్ కమిటి మెంబర్ బోరబండ కార్పోరేటర్ బాబాఫసియుద్దీన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నేషనల్ హెరాల్డ్ కేసు నమోదు చేసినందుకు నిరసనగా గురువారం టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా జరిగింది. ఈకార్యక్రమానికి బోరబండ డివిజన్‌నుంచి బాబాఫసియుద్దీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు యిడి కార్యలయానికి పెద్ద ఎత్తున ర్యాలీగా తరలి వెళ్ళారు. ఈకార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.అశోక్ తో పాటు పలు బస్తీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామీణ స్థాయిలో తీసుకెళ్లాలి

**- ఆల్ ఇండియా ట్రైబల్ జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ నాయక్**



ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

**తార్నాక, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామీణ స్థాయిలోకి వెళ్లడం లేదని, సంక్షేమ పథకాలను గ్రామీణ స్థాయిలో తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ నాయక్ అన్నారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆల్ ఇండియా ట్రైబల్ జెఎసి ప్రోటోకాల్ చైర్మన్ గోపి నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్ నాయక్, గోపి నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంవత్సర కాలంలో ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సన్న బియ్యం, భూభారతి లాంటి పథకాలకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ పార్టీకి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నిరుద్యోగుల కోసం 53 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. సంక్షేమ పథకాలు గ్రామీణ స్థాయిలోని ప్రజలకు చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో ఉండే నాయకులను పరుగులు పెట్టిస్తే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తాయని అన్నారు. స్థానిక నాయకులు ప్రజల్లోకి పథకాలు వెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల అంశంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీకి ఆల్ ఇండియా ట్రైబల్ జేఏసీ తరపున తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో గణేష్ నాయక్, మహేందర్, వినోద్, భాస్కర్ నాయక్, నాగా నాయక్, శంకర్, నవీన్, దేవేందర్, ప్రమోద్ పాల్గొన్నారు,

## విద్యార్థి దశ నుండే ఈతను బోధన చేయాలి : సామాజిక కార్యకర్త రవీందర్

**జీడిమెట్ల, ఏప్రిల్ 17, ప్రభాతవార్త**

వేసవికాలం వచ్చిందంటే చాలు చెరువులు, కుంటలు, నదులలో దిగి పిల్లలు యువకులు ప్రాణాలు కోల్పోతున్నారని, పిల్లలు నిండు ప్రాణాలను అరికట్టాలంటే విద్యార్థి దశ నుండే ఈతను ఒక పాఠ్యాంశంగా చేర్చి బోధన చేయాలని సామాజిక కార్యకర్త రవీందర్ పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈత నేర్చుకుంటే ప్రమాదం జరిగినప్పుడు కాళ్ళు చేతులు ఆడిస్తూ ప్రమాదం నుండి బయట పడవచ్చు, ఈతపై అవగాహన లేని పిల్లలు భయంతో నీరు తాగి మునిగిపోయి ప్రమాదాలకు గురైవుతారు. ఆసమయంలో పైనయున్నవారు తాడు కర్ర, చున్నీ, దోతి లాంటి సాధనాలను అందిస్తే వారిని కాపాడవచ్చు అనే విధంగా విద్యారులకు బోధించి.. పెద్దల సాయంతో ఈత నేర్చుకున్నచో పరీక్షలలో అధనంగా 2 మార్కులు ఇస్తామని ప్రభుత్వం ఉద్యోగాల కొరకు ప్రయత్నించే వారికి ఈత, రావాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తే భావి ఫౌరుల ప్రాణాలను రక్షించగలరు. ఈ విషయంపై గత 20 సంవత్సరాలుగా పోరాడుతున్న సామాజిక అవగాహనతో పోరాడుతూ గత ముఖ్య మంత్రులయిన వైస్సార్, కెసిఆర్ ఇతర అధికారులకు 30జిల్లా కలెక్టర్‌లకు, ఎంఎల్ఏలకు ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు అభ్యర్థనలు ఇచ్చాము కాని ఫలితం శూన్యం.. గురువారం ఖమ్మంలో సరదాగా ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి.

ఈ విధంగా ఒక నివేదిక ప్రకారం ఈత ఒక సాధన అని తెలియక రెండు తెలుగు రాష్ట్రాలలో 1000 నుండి 1200 మంది ఇక దేశంలో 30 వేల నుండి 50 వేల మంది విద్యార్థుల యువకుల ప్రాణాలు కేవలం ఈత రాక చనిపోతున్నారు. ఈతకు వెళ్లిన పిల్లల మరణంతో కన్న తల్లిదండ్రుల కడుపుకోత మిగిలిస్తున్నారు. ఇప్పటికైన ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలి

**-మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ షారూఖీ**





సమావేశంలో పాల్గొన్న టిజిఎస్‌పిడిసిఎల్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ, హైదరాబాద్ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు చక్రపాణి, డైరెక్టర్లు, సౌత్ సర్కిల్ ఎస్ఈ సోమిరెడ్డి

**చార్మినార్,ఏప్రిల్ 17ప్రభాతవార్త :** వినియోగదారులకు అందుబాటులో ఉండటంతో పాటు వారి నుంచి వచ్చే విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను వెంటనేపరిష్కరించాలని టిజిఎస్ పిడిసిఎల్ చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందిని ఆదేశించారు. హైదరాబాద్ పాతబస్తీ సౌత్‌సర్కిల్ పరిధిలోని విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది బాగా పని చేసి సంస్థకు మంచి పేరు తీసుకు రావటానికి కృషి చేయాలని, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కావాలన్న అందిస్తామని ఆయన తెలిపారు.హైదరాబాద్ పాత నగరం నయాపూల్‌లోని మినర్వా గార్డెన్‌లో సౌతరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన హైదరాబాద్ సౌత్ సర్కిల్ ఇంట్రాక్షన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వాహణలో ఉద్యోగులపై దాడులు జరిగితే ఇరవై నాలుగు గంటలలోపు ఎఫ్ఐఆర్ జరిగేలా చర్యలు తీసుకుంటామని,విద్యుత్ వినియోగదారులుఫోన్ చేస్తే వారితో విద్యుత్ ఉద్యోగులు ఎంతో ఆప్యాయతతో మాట్లాడి సమస్యలను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.గత సంవత్సరం విద్యుత్ సరఫరాలకు సంబంధించిన సమస్యలు చాలా ఎక్కువ వచ్చాయని,ఈ సంవత్సరం ఆ పరిస్థితి లేదని ఆయన తెలియజేశారు.ప్రస్తుతం వేసవి కాలంలో రానున్న 45 రోజులు చాలా ముఖ్యమని పాతబస్తీలోని విద్యుత్ ఉద్యోగులు,సిబ్బంది కష్టపడి విద్యుత్ సరఫరాలో ఎటువంటి సమస్యలు లేకుండ కృషి చేయాలని ఆయన తెలిపారు.ఆర్టిజన్ల సమస్యలపై ఇంత వరకు రెండు సార్లు చర్చించటం జరిగిందని,సంస్థలో మెటీరియల్ కొరత లేదని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు నర్సింహులు నంద కుమార్,హైదరాబాద్ మెట్రో జోన్ చీఫ్ ఇంజనీరు చక్రపాణి సౌత్ సర్కిల్ ఎస్ఈ సోమిరెడ్డి, చార్మినార్ డిఈ ఎం.శ్రీ ధర్,బేగంబజార్ డిఈ ఫర్హత్ అలీ,అస్మాన్‌ఘడ్ డిఈ విష్ణువర్ధన్ రెడ్డి,మీరాలం ఏడిఈ వెంకటేష్ గౌడ్,ఫలక్‌నుమా ఏడిఈ రాజు, చార్మినార్ ఏడిఈ మహ్మద్ మక్సూద్,చార్మినార్ సిబిడి ఏడిఈ మహ్మద్ అక్బర్.ఫలక్‌నుమా సిబిడి ఏడిఈ రంజిత్ సింగ్‌తో పాటు సౌత్ సర్కిల్ పరిధిలోని దాదాపు 900 మంది విద్యుత్ అధికారులు, ఉద్యోగులు,ఆర్టిజన్లు పాల్గొన్నారు.సమావేశంలో చార్మినార్, బేగంబజార్,ఆస్మాన్‌ఘడ్ డివిజన్‌లకు చెందిన విద్యుత్ ఉద్యోగులు,ఆర్టిజన్లు సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని టిజిఎస్‌పి డిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీకి విజ్ఞప్తి చేశారు.పలువురు విద్యుత్ ఉద్యోగులు తమ సమస్యలను సమావేశంలో చైర్మన్,మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీకి విన్నవించారు. ఉద్యోగులు,సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫారూఖీ హామి ఇచ్చారు.

## పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ బుకింగ్ పద్ధతి కొనసాగించాలి





**అత్తాపూర్ ఏప్రిల్ 17,ప్రభాతవార్త :** స్లాట్ బుకింగ్ ఆన్లైన్ చేయకుండా పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ బుకింగ్ పద్ధతి కొనసాగించాలని డాక్యుమెంట్ రైటర్లు డిమాండ్ చేశారు.గురువారం రాజేంద్రనగర్ సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం ముందు డాక్యుమెంట్ రైటర్లు ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పభుత్వం ఏర్పాటుచేసిన ఆన్లైన్ స్లాట్ బుకింగ్ నూతన విధానం వల్ల డాక్యుమెంట్ రైటర్‌లు ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పాత పద్ధతిలో రిజిస్ట్రేషన్ బుకింగ్ కొనసాగించాలని కోరారు.అనంతరం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు.

## ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్‌కు వివిఎస్ఆర్ అభినందన



దాసోజు శ్రావణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న వివిఎస్ఆర్

**చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** శాసనమండలి లో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన దాసోజు శ్రవణ్ కుమార్‌ను కలిసి రామ్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అభినందనలుతెలిపారు. మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి తనయుడు నాయిని దేవేందర్‌రెడ్డితో కలిసి అసెంబ్లీ వద్ద దాసోజు శ్రావణ్‌కుమార్‌ను కలిసారు. దాసోజు శ్రవణ్ కుమార్ కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు సిరిగిరి శ్యామ్, నేతా శ్రీనివాస్, రేషం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పి.వి.మనోహర్ రావుకు అంతర్జాతీయ ఉగాది పురస్కారం



పివి. మనోహర్‌రావును సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** సర్వార్థ సంక్షేమ సమితి అధినేత, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మాజీ ప్రధాని "భారతరత్న" స్వర్గీయ పి.వి.నరసింహారావు సోదరులు పి.వి.మనోహర్ రావు కు అంతర్జాతీయ ఉగాది పురస్కారం అందుకున్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో వంశీ ఇంటర్నేషనల్ ఇండియా ఆధ్వర్యంలో వంశీ సంస్థల అధినేత, కళా బ్రహ్మ డాక్టర్ వంశీరామ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ముఖ్య అతిధిగా శాసనసన మండలి సభ్యుడు బుద్ధ ప్రసాద్, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య మనవడు జివిఎన్. నరసింహం, తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వెలుదండ నిత్యానంద రావు చేతులమీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో పివి. కిరణ్, వంశీ సంస్థల అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ పాల్గొన్నారు.

## అక్రమంగా నల్లా కనెక్షన్లకు మోటర్లు బిగిస్తే కఠిన చర్యలు : ఎండి అశోక్ రెడ్డి



అక్రమంగా నల్ల కనెక్షన్‌కు వాడుతున్న మోటర్లను సీజ్ చేసిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి తదితరులు

**సంజీవరెడ్డి నగర్,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** అక్రమంగా మోటర్లను వాడుతున్న వారిపై ఎండి అశోక్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2వ రోజు కొనసాగిన మోటర్ ఫ్రీటాప్ డ్రైవ్ ఎస్.ఆర్.నగర్, మధురా నగర్‌లలో పర్యటించిన ఎండి అశోక్ రెడ్డి, జిఎం.హరిశంకర్ వారి సిబ్బందితో కలిసి పర్యటించి పలు హాస్టల్స్, నివాసాల నుంచి 32 మోటర్లను స్వాధీనం చేసుకొని 38 మందికి ఫెనాల్టీ విధించారు. వ్యవసాయానికి వాడే మోటర్లతో నీటిని వాడుతునా న్నరని, మళ్లీ ఇలాంటి తప్పు చేస్తే నల్లా కనెక్షన్లు తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు విభా గాల అధికారులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన బాలిక

**సంజీవరెడ్డి నగర్,ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు తెలిపిన వివరాల ప్రకారం సనత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నివాసం ఉండే పురుషోత్తం కూతురు శృతి 17 సంవత్సరాలు చామన ఛాయ కలర్‌లో ఉంటుందని, తన బంధువుల ఇంటికి వెళ్తున్నాని స్కూల్ బ్యాగ్‌లో దుస్తులు పెట్టుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఎంతకి తిరికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు సనత్ నగర్ పోలీస్‌లను ఆశ్రయించారు. ఈ మేరకు సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే సనత్ నగర్ పోలీసులకు తెలుపాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు తెలిపారు.

## కెటిఆర్‌కు గోల్నాక పరిస్థితులను వివరించిన దూసరి



**హైదరాబాద్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త :** అంబర్‌పేట నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీలో అప్పుడే జిహెచ్ఎంసి టికెట్ల పంచాయతీ రాజుకుంది. గురువారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దృష్టికి గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య భర్త శ్రీనివాస్‌గౌడ్ తీసుకెళ్లారు. గోల్నాక కార్పొరేటర్ టికెట్‌ను వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో మరొకరికి కేటాయిస్తున్నట్లు ప్రచారం నిర్వహిస్తున్నారని ఆయన కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లారు.అందుకు స్పందించిన కెటిఆర్ 'బిఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయింపు అనేది పార్టీ నిర్ణయిస్తుంది.ఎవరి ఇష్టం ఉన్నట్టు వాళ్ళు మాట్లాడడం సరైనది కాదు, నీ పని నువ్వు చేసుకో.ఎవరో చెప్పాల్సిన అవసరం లేదు, శీను నేను ఉన్నాను, నీ పని నువ్వు చేసుకో.టికెట్ విషయంలో ఎవరి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు, ప్రజల గురించి, డివిజన్‌లో అభివృద్ధి కోసం పోరాడు.అన్నీ నాకు తెలుసు ఎవ్వరో ప్రకటన చేస్తే వాటిని పట్టించుకో వాల్సిన అవసరం లేదు, నీ పని నువ్వు చేసుకో డివిజన్లో ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడు' అని కెటిఆర్ పేర్కొన్నట్లు దూసరి శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రక టనలో తెలిపారు.తాను కెటిఆర్‌ను స్వయంగా కలవడం, ఆయన అందించిన సూచనలు,భరోసాతో తనకు చాలా సంతోషం కలిగించిందని పేర్కొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా శేరి ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా న్యాయవాదుల సంఘం జిల్లా కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఇటీవల ముగిసిన రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షులుగా శేరి ప్రతాప్‌రెడ్డి విజయం సాధించారు. ఈమేరకు గురువారం అధ్యక్షులుగా శేరి ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కార్తీక్ బాసెట్టి, ఉపాధ్యక్షులుగా కొమ్మూరి గాల్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా కే. విష్ణువర్ధన్‌రెడ్డి, మహిళా ప్రతినిధిగా పలుసం అనసూయ, కోశాధికారిగా కరణం ప్రశాంత్, లైబ్రరీ కార్యదర్శిగా జక్కుల వెంకటేష్, స్పోర్ట్స్, సాంస్కృతిక కార్యదర్శిగా అంతటి స్వామి, కార్యవర్గ సభ్యులుగా ధరావత్ జ్యోతి, గౌడ రాజశేఖర్,నూనె భాగ్య, బోరంపేట చంద్రశేఖర్, మండలపురం సునీత, బన్నె మల్లేష్, బి. సుఖేందర్‌రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి మా ట్లాడుతు తనపై నమ్మకంతో గెలిపించిన న్యాయవాదులందరికి కృతజ్ఞతలు తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న సమస్యలతో పాటు న్యాయవాదులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## సత్తా చాటిన తెలంగాణ విద్యార్థులు

### జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు





పోటీల్లో గెలుపొందిన తెలంగాణ విద్యార్థులు

**హైదరాబాద్,ఏప్రిల్ 17,ప్రభాతవార్త:** పుదుచ్చేరిలో జరిగిన 40వ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో తెలంగాణ అండర్-16 బాస్కెట్ బాల్ జట్టు సత్తా చాటింది. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి వచ్చిన జట్లతో తెలంగాణ జట్టు ధీటుగా తలబడి టాప్-4లో నిలిచారిన జట్టు కోచ్‌లు సంతోష్, పంకజ్, అమృత్ తెలిపారు. బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో అగ్రశేణి జట్లుగా ఉన్న ఢిల్లీ, కర్ణాటక, ఉత్తర్ ప్రదేశ్ జట్లను ఓడించిన తెలంగాణ జట్టు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచిందని కోచ్‌లు తెలిపారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ తెలంగాణ బాస్కెట్ బాల్ జట్టులో ఉన్నారని వారు తెలిపారు.

## విబి సిటిలో కుక్క పిల్లలను హత్య చేసిన సైకో

**అల్వాల్, ఏప్రిల్ 17 ప్రభాతవార్త:** బొల్లారం విబి సిటిలో పది రోజులు క్రితం జన్మించిన కుక్క పిల్లలను హత్య చేసిన ఓ వ్యక్తిపై అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటనకు సంబంధించి పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. విబి సిటి అపార్ట్‌మెంట్‌లో ఇటీవల ఊర కుక్క నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. ఆదే అపార్ట్‌మెంట్‌లో ఆశిష్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16వ తేదీ బుధవారం మద్యాహ్నం కె బ్లాక్ సెల్లార్‌లో కుక్క పిల్లలను ఓ వ్యక్తి హత్య చేసిన విషయం సిసి ఫుటేజీలు ద్వారా బయట పడింది. నెల కూడా నిండని నాలుగు కుక్క పిల్లలను బ్రిక్స్, టైల్స్‌తో కొట్టి చంపిన దృశ్యాలు కనిపించాయి. చని పోయాయా లేదా అని నిర్ధారించుకునేందుకు మరలా వాటిని అశిష్ నేలకేసి కొట్టడం వ్యక్తి రాక్షసత్వానికి నిదర్శనంగా ఉంది. సైకో మనస్తత్వం కలిగిన వ్యక్తులే ఈ విధంగా ప్రవర్తించగలుగుతారని అక్కడ నివాసం ఉంటున్నవారు పేర్కొన్నారు. మూగ జీవాలను అతి పాశవికంగా చంపిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిందితుడుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు సన్మానం

**-ఘనంగా పాఠశాలలో సరస్వతీ విగ్రహ ఆవిష్కరణ**



పాఠశాలలో సరస్వతి విగ్రహ ఆవిష్కరణ దృశ్యం

**కొడంగల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

కొడంగల్ మండలంలోని కస్తూరిపల్లి గ్రామం ఎంపియూపి పాఠశాలలో గురువారం బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులతో పాటు కొత్తగా పాఠశాలకు బదిలీపైవచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు పాఠశాలలో శ్రీసరస్వతివిగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రెండు ఘట్టాలు ఒకే వేదికపై అనుసంధానమై, అధ్యాత్మికత గౌరవం, కృతజ్ఞతలతో కూడిన అరుదైన కార్యక్రమంగా నిలిచింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి రజితారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో దీపప్రజ్వలనతో ప్రారంభమైన సభలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. పాఠశాలకు శ్రీసరస్వతీదేవి విగ్రహాన్ని అందించిన శ్రీకాంతరావు, దిమ్మె ఏర్పాటుకు రూ.10వేలు విరాళం అందించిన హింది పండిత్ కె. రేణుకాదేవి తదితరులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలనుంచి బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు కె. రేణుక, శ్రీ శరణ్ బసప్ప, మిల్కారాణి, పి. సురేష్‌లను పాఠశాల ఉపాధ్యాయుల బృందం సన్మానించారు. విద్యార్థులకుగుర్తుగా వారు స్టీల్‌ప్లేట్‌లను అందజేశారు. అలాగే కొత్తగా పాఠశాలలో చేరిన ఉపాధ్యాయులు డా. మానువురి వెంకటేశ్వర్లు, జి. రాములు, సాయిభవాని, చంద్రకళ తదితరులను సన్మానించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతాభావాలు వ్యక్తపరిచారు. అలాగే వివిధసాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక ఉత్సాహంగా మారింది. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామపెద్దలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ ఆశయాలను కొనసాగించాలి



శేఖర్ మహారాజ్‌తో రామ్‌చరణ్

**జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

సేవాలాల్‌మహారాజ్ ఆశయాలను కొనసాగించాలని ఆయన వారసులు రామారావుమహారాజు, మనవడు శేఖర్‌మహారాజ్ సూచించినట్లు ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లెడుచౌదరిగూడ మండలఅధ్యక్షుడు రామ్‌చరణ్‌నాయక్ తెలిపారు. గురువారం మర్యాదపూర్వకంగ కలిసినట్లు ఆయన పెర్కొన్నారు. ఆయన ఆశీర్వాదం తీసుకోవడంతోపాటు సేవాలాల్‌మహారాజ్ ఆశయాలకు అనుగుణంగా ఎల్‌హెచ్‌పిఎస్‌ను ముందుకు తీసుకెళ్లామని పేర్కొన్నారు.

## రోడ్డు భద్రతానియమాలు పాటించాలి

**-మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకట్‌రెడ్డి**




రోడ్డుభద్రతావారోత్సవాలను ప్రారంభించిన ట్రాఫిక్ ఏసిపి వెంకట్‌రెడ్డి

**శామీర్‌పేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

రోడ్డుభద్రతా నియమాలను పాటించాలని ప్రజల్లో చైతన్యం రావాలని రోడ్డు భద్రతావారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. దీనిలో ఆయనతోపాటు వివిఎస్‌బి విద్యాసంస్థల ఎంబిఏ డైరక్టర్ మదన్‌మోహన్ పర్యటించి ప్రజలకు పలు సూచనలు చేశారు. గురువారం శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని పది గ్రామాల్లో రోడ్డుభద్రతా వారోత్సవాలనునిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. తూంకుంట, శామీర్‌పేట, మజీద్‌పూర్, పలు గ్రామాల్లో రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజలను చైతన్యం చేయటానికి కార్యక్రమాలను నిర్వహించారు. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని రోడ్డు ప్రమాదాలను అరికట్టటానికి రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ సిఐ హనుమాన్‌గౌడ్, విశ్వవిశ్వాని కళాశాలకు చెందిన పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు 20గొర్రెలు మృతి



పిడుగు పాటుకు మృత్యువాత పడిన గొర్రెలు

**బొంరాస్‌పేట్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

పిడుగుపాటుకు 20గొర్రెలు మృత్యువాతపడిన విషాదఘటన బుర్రితండా గ్రామపంచాయతీపరిధిలోని మైసమ్మగడ్డతండా పరిసరప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. తండాకుచెందిన బాధితుడు పీక్యానాయక్ తెలిపిన వివరాలమేరకు గురువారం సాయంత్రం గాలివాన భీభత్సంతో అకాలవర్షం కురిసింది. దీంతో తండాపరిసరప్రాంతంలోని తనపొలంలో మేతమేస్తున్న 50గొర్రెలు మర్రిచెట్టు క్రిందకు వెళ్ళాయి. సుమారు 6:30 గంటలకు చెట్టుపై పిడుగుపడి 15గొర్రెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. 5గొర్రెలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈసంఘటనతో తనకు దాదాపు 2లక్షల రూపాయలు నష్టంకల్గిందని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. నష్టనివారణకై ప్రభుత్వం ఆర్థికంగా తన ను ఆదుకోవాలని విజ్ఞప్తిచేశాడు.

## పిహెచ్‌సికి వైద్య పరికరాల పంపిణీ

**షాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

షాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెల్స్పన్ ఫౌండేషన్ ద్వారా వైద్య పరికరాలను గురువారం ఉచితంగా అందజేశారు. వెల్స్పన్ ఫౌండేషన్ ఫ్లోరింగ్ వైస్ ప్రెసిడెంట్, ఐటి హెడ్ సుబ్రహ్మణ్యం గుప్తా మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గ్రామస్థులకు ఎన్నో వైద్య ఆరోగ్య సేవలు అందుతున్నాయని, తమవంతుగా వైద్యపరికరాలను అందజేస్తున్నామన్నారు. అందులో భాగంగానే బిపి మనిటర్, ధర్మామీటర్లు, బయోమెడికల్ వ్యర్థాల కొరకు బిన్స్, గ్లూకోమీటర్, పల్సాక్సీమీటర్, ఫీటల్ డాప్లర్ తదితర పరికరాలను ఆసుపత్రికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్స్పన్ ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ శ్రీమతి కె. సురేఖ, షాబాద్ పీహెచ్‌సి ఆరోగ్య అధికారి డాక్టర్ ప్రభాకర్, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, పీహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

**-లభించనున్న భూభారతి-నూతన ఆర్ఓఆర్ చట్టం**
**-మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్**



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి, నూతన ఆర్ఓఆర్ చట్టం ద్వారా భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ స్పష్టం చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో భూభారతి, నూతన ఆర్ఓఆర్ చట్టంపై తహసీల్దార్లకు, రెవెన్యూ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ భూభారతి ఆర్ఓఆర్‌చట్టంలోని అన్ని అంశాలను క్షుణ్ణంగాచదివి పూర్తి అవగాహన చేసుకోవాలన్నారు. 1989ఆర్ఓఆర్‌చట్టంలోని అంశాలు భూభారతిలోని అంశాలు కొంతవరకు సిమిలర్‌గా ఉన్నాయని, అంతేకాకుండా రెవెన్యూ అధికారులకు ధరణిలోలేని అధికారాలు భూభారతిలో ఉన్నాయన్నారు. ఈ అధికారాలతో రెవెన్యూ అధికారులపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రతిదీ ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ రికార్డులను నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులకు పూర్తిస్థాయి అధికారాలు వచ్చేవరకు ప్రొసీడింగ్స్‌ద్వారా మాన్యువల్‌గా నిర్వహించాలని, నూతన మార్గదర్శకాలతో సమ్మతించటం, తిరస్కరించటం చేయాలని స్పష్టంచేశారు. ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూభారతి, వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూభారతి 2025చట్టంలో 23సెక్షన్లు, 18నిబంధనలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆధార్ తరహాలో భవిషత్‌లో భూమికి సంబంధించి సర్వే చేసి కొలతలు, హద్దులువంటి సమగ్రమైన వివరాలతో భూధార్ తీసుకురాబోతుందని ఆయన పేర్కొన్నారు. ఈచట్టం ద్వారా భూముల రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించబడిందని, భూమి రిజిస్ట్రేషన్, మ్యూటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాపు తయారు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాల పరిష్కారం ఈ చట్టంద్వారా వేగవంతంకావటంతో పాటు వారసత్వ భూముల మ్యూటేషన్‌ను గడువులో పూర్తిచేయటం, హక్కుల సంక్రమణను ఆధికారికంగా నమోదుచేయటంద్వారా వ్యవస్థ మరింత నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. భూసమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీలు వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తుందని తెలిపారు. ఇంటిస్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధిచేయటంతోపాటు భవిషత్‌లో పేదరైతులకు ఉచితన్యాయసహాయం అందించేదిశగాచర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణను శాస్త్రీయంగా చేస్తూనే, మోసపూరితంగాపొందిన ప్రభుత్వభూములపై పట్టాలను రద్దుచేసే అధికారం ఈచట్టంద్వారా కల్పించబడిందని, భూభారతి రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారంలా నిలుస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతేకాకుండా భూసమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూభారతిచట్టంపై అవగాహనను ఏర్పరచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 19నుంచి జిల్లాలో అవగాహన సదస్సులు ఉంటాయని, ఈసదస్సులద్వారా భూభారతిచట్టంపై ప్రజలకు, రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాశ్, డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్, తహసీల్దార్లు, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలి

**-షాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్**



ఎంకమ్మ గూడలో విద్యార్థులను సన్మానిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్, ఇతరులు

**షాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

పిల్లలకు నాణ్యమైనవిద్యను అందించేలా కృషి చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని షాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ అన్నారు. మండల పరిధిలోని వెంకమ్మగూడలో 11మంది విద్యార్థులు గురుకుల విద్యాసంస్థలకు ఎంపిక కావడంతో గురువారం గ్రామంలో వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈఓ లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నత విద్యార్హత కలిగిన వారు ఉండి, పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తారని తెలిపారు. పాఠశాలల్లో డిజిటల్ తరగతి బోధన, ఏఐ తరగతులు, ఎన్నో వినూత్నరీతుల్లో బోధనను పిల్లలకి అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలో 100పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారని, అందుకు పిల్లల తల్లిదండ్రులను, గ్రామస్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పాండు, తాళ్లపల్లి కాంప్లెక్స్ జిహెచ్‌ఎం ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్‌ఎంసి చైర్మన్ సరిత, నాయకులు నరసింహులు, కుమార్, ఎం. హరీష్, శ్రీకాంత్, రవి, మహేందర్ సింహాద్రినాయుడు, ఉపాధ్యాయులు హేమసుందర్‌రావు, సరిత, అంగన్వాడి టీచర్ కె. వినోద, తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడి నరసింహారావు

**ఆమనగల్లు, ఏప్రిల్17, ప్రభాతవార్త:**

ఆమనగల్లు మండల కేంద్రంలో గురువారం జిల్లా వ్యవసాయాధికారి ఎన్. నరసింహారావు ఆకస్మికంగా పర్యటించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ఏఓ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆయన ఎరువుల దుకాణాలకు చేరుకుని నిర్వాహకులతో మాట్లాడారు. వచ్చే వానాకాలం వ్యవసాయ సీజన్‌లో అవలంబించవలసిన పలు అంశాలను ఆయన దుకాణదారులకు వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించాలని సూచించారు. అమ్మకాలు, కొనుగోలువివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో పొందుపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఆయాదుకాణ యజమానులు ఉన్నారు.

## రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యం

**-ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్**




శిక్షణ శిబిరంలో పాల్గొన్న శ్రీనునాయక్

**షాద్‌నగర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్ జిల్లా ఆరంగ్ నియోజకవర్గంలో ఆదివాసీ కాంగ్రెస్ చత్తీస్‌ఘడ్ రాష్ట్ర ట్రైనింగ్ క్యాంపు రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు, ప్రస్తుత ఎమ్మెల్యే జనక్‌ధృ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించినట్లు ఆదివాసీ కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్ పేర్కొన్నారు. క్యాంపులో జాతీయ అధ్యక్షుడు, మధ్యప్రదేశ్ ఎమ్మెల్యే విక్రాంత్ భోరియా, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి భూపేష్ భాగేల్, మాజీ మంత్రులు శివకుమార్ దాహరియా, తామరద్వాజ్ సాహు, తెలంగాణ ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యానాయక్, కొట్యానాయక్, రానాప్రతాప్ తదితరులు పాల్గొన్నట్లు శ్రీను నాయక్ పేర్కొన్నారు. ఈసందర్భంగా యువనేత రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈశిక్షణశిబిరం తమలోని నాయకత్వలక్షణాలు పెంపొందించుకోవడానికి దోహదపడిందని, నూతన ఉత్తేజంతో పార్టీ బలోపేతానికి తనవంతు సహకారం అందిస్తానని శ్రీను నాయక్ పేర్కొన్నారు.

## గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



ఆవుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారిణి పద్మిని

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

పశువులు, గొర్రెలు, మేకలకు వచ్చే గాలికుంటు నివారణకు గాను పశుపోషకులు జీవాలకు టీకాలు (ఎఫ్ఎండి) వేయించాలని మండల పశువైద్యాధికారిణి పద్మిని తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్, ఎదులాబాద్‌లో గురువారం పశువులకు గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యాధికారిని పద్మిని సిబ్బందితో కలిసి ఆవులు, గెదేలకు ఎఫ్ఎండి వ్యాక్సినేషన్ చేశారు. ఈసందర్భంగా 12 మంది రైతులకు చెందిన 38 ఆవులకు, 150 గెదేలకు మొత్తం 188 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఘట్‌కేసర్ మండలంలో మొత్తం 5,865 పశువులకు గాను 1,881 ఆవులకు, 3,984 గెదేలకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆమె తెలిపారు.

# జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్

**పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు**




కార్యక్రమంలో ప్రతిజ్ఞచేసిన టిపిసిసి ఉపాధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాజీ ఎమ్మెల్యే ఎం, సుధీర్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి. నర్సింలుయాదవ్

**శామీర్‌పేట, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ఏఐసిసి, టిపిసిసి పిలుపు మేరకు ఉద్దెమర్రి గ్రామంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉద్దెమర్రి గ్రామంలో పలువార్డులలో కాంగ్రెస్ శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రిగ్రామంలో జరిగిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భారీసంఖ్యలో కాంగ్రెస్‌పార్టీశ్రేణులు పాల్గొన్నారు. ఈర్యాలీలో పాల్గొని పార్టీసూచనలమేరకు ప్రతిజ్ఞచేసి ప్రజల్లోకి నాయకులువెళ్లారు. దీనిలో టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం, సుధీర్‌రెడ్డి, మేడ్చల్‌ఎఎంసిచైర్మన్ బి. నర్సింలుయాదవ్‌లు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా అమలుచేస్తున్న ఆరుగ్యారంటీ పథకాలపై ప్రజలను కలిసి నాయకులు వివరించారు. ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో పూర్తిగ అన్నింటిని కచ్చితంగ అమలుచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ వైస్‌ఎంపిపి ఎం. శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉద్దెమర్రి నర్సింహ్మారెడ్డి, మాజీ సర్పంచులు దోసకాయల వెంకటేశ, పి. బాల్‌నర్సింహ్మా, గ్రామ అధ్యక్షులు వెంకటేశ, నాయకులువిష్ణుగౌడ్, లక్ష్మారెడ్డి, ప్రభాకర రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. ఆతరువాత శ్రీవిష్ణు, శివాలయంలో పలు అభివృద్ధి పనులకు టిపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డిలు భూమిపూజచేశారు. ఆలయంలో రెండుగోపురాలు, పుష్కరిణి, నీరాలిమంటపం, పుష్కరఘాట్ లాంటిపనులకు ప్రభుత్వం 50లక్షలరూపాయలు మంజూరు చేసినందున పనులు ప్రారంభించటానికిభూమిపూజచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు ఉద్దెమర్రి నర్సింహ్మారెడ్డి, మేడ్చల్ ఎఎంసిచైర్మన్ బి. నర్సింలుయాదవ్, మాజీ సర్పంచులు డి. వెంకటేశ, పి. బాలనర్సింహ్మా, మాజీ వైస్‌ఎంపిపి ఎం. శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు విష్ణుగౌడ్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, ఆంజనేయులు, రవీందర్‌గౌడ్, రాజిరెడ్డి, రమేశ్, గద్దం రమేశ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

**-ఎల్గొండగూడ ప్రభుత్వపాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్‌గౌడ్**



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**షాబాద్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు గ్రామస్తులు చొరవ తీసుకోవాలని ఎల్గొండగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేష్ గౌడ్‌అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా షాబాద్ మండల పరిధిలోని ఎల్గొండగూడ గ్రామంలో గురువారం బడిబాట నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చేర్పించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి, గ్రామంలో మంచి ప్రమాణాలతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి నైపుణ్యం, శిక్షణ గల ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు. గ్రామం నుండి ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్న 30 మంది విద్యార్థులను, ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తామని గ్రామస్తులు హామీ ఇవ్వడంతో ఆయన వారిని అభినందించారు. కార్యక్రమంలోఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు గ్రామస్థులు సతీష్, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

**-క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు వి.కిరణ్**



మాట్లాడుతున్న వి.కిరణ్

**పెద్దేముల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని తాండూరు నియోజకవర్గ క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు వి.కిరణ్ అన్నారు. గురువారం పెద్దెముల్ మండలం కందనెల్లి గ్రామంలో మెథడిస్టు చర్చ్ ప్రహరి గోడ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో క్రిష్టయన్ మైనార్టీ ఫండ్ ద్వారా రూ. 5 లక్షలతో పనులను ప్రారంభించిడం జరిగిందని అన్నారు. ఇతర గ్రామాలలో కూడా మైనార్టీ క్రిష్టియన్ల కోసం అభివృద్ధి పనులను దశలవారిగా చేపడతామని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను దశలవారిగా నెరవేరుస్తు సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతోందని అన్నారు. సుస్థిర పాలన అందించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్ జనార్ధన్, పాస్టర్ అబ్రహం, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌చారీ, నారాయన్‌రెడ్డి, లియాఖత్ అలీ, యండి సర్ధార్, యండి వాజిద్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు ఓ వరం

**కొడంగల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ఆపద సమయంలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యం అందించేందుకు గాను సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరంలాంటిదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్, గ్రామ అధ్యక్షులు టీ. భీమయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని హస్నాబాద్‌లో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. గ్రామానికి చెందిన బొంగు చిన్న రాజుకు రూ. 1లక్ష, మైనోద్దిన్‌కు రూ. 1లక్ష, కక్కునేరి శ్రీనివాస్‌కు రూ. 14000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దుద్యాల్ మండల వ్యవసాయ అధికారిగా నాగరాజు

**దుద్యాల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

మండల నూతన వ్యవసాయ అధికారిగా సదుల నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్చార్జి ఏవోగాపనిచేస్తున్న హిమబిందు తన రెగ్యులర్ స్థానం తాండూర్‌కి వెళ్లారు. నూతన ఏవో నాగరాజు మాట్లాడుతూ, రైతుభరోసా, రైతుభీమా, వంటి వ్యవసాయ సంబంధిత సమస్యల పరిష్కారానికి తన ను సంప్రదించాలని కోరారు. దుద్యాల్ మండల రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు.

## వడగళ్ళ వానతో నేలకొరిగిన వరికంకులు

**-ఆందోళన వ్యక్తంచేస్తున్న రైతులు**



కురిసిన వడగళ్ళ వానకు నష్టపోయిన పంట

**పెద్దేముల్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

వడగళ్ళ వర్షానికి ఈదురు గాలులు తోడవ్వంతో వరికంకులు నేలకొరిగి ధాన్యం రాలిపోయింది. దీంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్, జనగాం, రుక్మాపూర్, దుగ్గాపూర్ తదితర గ్రామంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో పాటు ఈదురు గాలులు వీచడంతో వరికంకులు నేలకొరిగాయి, అంతెగాకుండా ధాన్యం రాలి నేలపాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్తితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వారం పదిరోజులలో కోత కోసే వరి పంట కళ్ళముందే నేల పాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాళం కష్టించి పండించిన చేతికొచ్చిన పంట నేల పాలు కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఎకరానికి రూ. 30 వేల వరకు పంట పెట్టు బడి పెట్టిన ఇప్పుడు ధాన్యం రాలిపోవడంతో తమ పరిస్థితి ఎందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చేతికొచ్చిన పంట నోటికాడికిరాకుండా నేలపాలుకావడంతో రైతులలోఆందోళన మొదలైంది. జరిగిన పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**-బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి**

**షాద్‌నగర్, ఏప్రిల్ 17, ప్రభాతవార్త:**

ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలో అకాల వర్షాలు, తీవ్ర గాలులవల్ల 32ఎకరాల కౌలు మామిడి రైతు శ్రీనివాస్‌గౌడ్, 4ఎకరాల బొప్పాయితోట రైతు పసుల జంగయ్య తోటలను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధనరెడ్డి సందర్శించి రైతులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాలవల్ల కౌలురైతు శ్రీనివాస్‌గౌడ్, బొప్పాయితోట రైతు జంగయ్యలను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పసల్‌బీమా యోజనపథకం తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంప్లిమెంటేషన్‌చేసి రైతులకు న్యాయంచేయాలని కోరారు. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.